తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) వారి 1988 ఉగాది మినీ కథల పోటీలో రు. 150 లు గెలుపొందిన కథ

# కాకి

ఇంగువ అన్నపూర్ణ



"అది మా చెమ్చా. మీ దొడ్లో పడేసింది కాకి" ఏడేళ్ళ నాని తన ఈడువాడైన ప్రక్కింటి గోపీతో అంటున్నాడు. వాళ్ళకు వీళ్ళకు పెరటి మధ్య పిట్టగోడ వుంది.

"మొన్నొకసారి మా సబ్బు కాకెత్తుకెళ్ళి మీ దొడ్లో వేస్తే మీ అమ్మ ఇచ్చిందా? నేనివ్వను ఫో" చేయి వెనక్కి దాచుకున్నాడు గోపి.

"దొంగతనం పాపం అని మాస్టారు చెప్పలేదూ? ఈ జన్మలో దొంగతనం చేస్తే వచ్చే జన్మలో కాకై పుడతారుట" కళ్ళు చక్రాల్లా తిప్పుతూ అన్నాడు నాని.

"అయితే మీ అమ్మే ముందు కాకిగా పుడుతుంది. అప్పుడు బాగా రాళ్ళేసి కొడతానులే చూస్తుండు" వాడి కోపమంతా కాకి మీదకి పోయింది. నాని వాళ్ళమ్మ కనిపిస్తే రాళ్ళేసి కొట్టాలని కూడా వాడికి కచ్చగా వుంది. తను చెమ్చా ఇవ్వకపోవడం దొంగతనమైతే నానీ వాళ్ళమ్మ చేసింది మాత్రం దొంగతనం కాదూ? సబ్బుకీ, చెమ్చాకీ చెల్లు! రోగం కుదరాలి అలాగే.

నానీ వాళ్ళమ్మని పిల్చుకొచ్చాడు రంగంమీదికి. చెయ్యి చాపింది సుబ్బలక్ష్మి చెమ్చా ఇమ్మన్నట్టు. గోపీకి ఏం చేయాలో తోచలేదు. వెనక్కి తిరిగి తమ వాటా వైపు చూశాడు. ఎప్పుడొచ్చిందో కమల నిలబడి వుంది గుమ్మంలో. మాట్లాడకుండా తల్లి చేతికిచ్చాడు చెమ్చాని.

కమల ఆ చెమ్చాని సుబ్బలక్ష్మివైపు విసిరింది. ఉక్రోషంగా చూశాడు గోపి.

"పోన్లే నాన్నా. వెధవ చెమ్చా కోసం కక్కుర్తి పడకూడదు" సుబ్బలక్ష్మి వినాలని అన్నది కమల.

"మరి మన సబ్బు వాళ్ళ వాటాలో కాకి పడేస్తే వాళ్ళిచ్చారేంటి?" తల్లి చేతిమీద కోపంగా కొడుతూ అడిగాడు గోపి.

"మరి ఎంగిలి విస్తరాకుల మీదికి కాకులే కదా వాల్తాయి" సుబ్బలక్ష్మి వాళ్ళ గుమ్మంకేసి చూస్తూ అన్నది కమల. చెట్టుమీద కూర్చుని అంతవరకు వినోదం చూస్తున్న కాకి ముఖం మాడ్చుకుంది ఆ మాటకి.

రయ్యిమని బయటికొచ్చింది సుబ్బలక్ష్మి.

"నేను కాకిని. నువ్వేమో రాజహంసవు. అర్థమవుతూనే వుంది నీ ఉపమానం. బోడి ఉపమానం...." కోపంతో మాట తడబడుతుంటే తను ధాయ తక్కువవేనేగా ఆ మాటలు.

వెంటనే కమల అందుకుంది "మాటంటే కోపం వస్తుంది కాని బుద్ధులు మాత్రం..."

"అమ్మా బాబాయిగారు పిలుస్తున్నారే" నాని తల్లి చీరె చెంగు లాగడంతో నానిని తీసుకుని సుబ్బలక్ష్మి కమలని కొరకొరా చూస్తూ లోపలికెళ్ళింది.

లోపల బాబాయిగారు పడుకుని వున్నాడు మంచంమీద. బాబాయిగారంటే ఆమెకు స్వంత మరిదేమీ కాదు. ఏదో దూరపు చుట్టరికం. ఎప్పుడైనా వస్తాడు. వచ్చినప్పుడు ఉత్త చేతులతో రాడు. ఆ ఇంట్లో మూడొంతుల సామాను బాబాయిగారి ప్రజంటేషన్లే. కానీ భార్యని, పిల్లల్ని మటుకు ఎప్పుడూ తీసుకురాడు.

"నువ్వెళ్ళి ఆడుకోరా నానీ. బాబాయిగారు కాస్సేపు పడుకుంటారు" అని సుబ్బలక్ష్మి నానిగాడ్ని బైటికి తోలి వీధి తలుపు గడియ వేసేసింది.

నానికి ఏం చేయాలో తోచలేదు. నాన్న త్వరగా వూర్నించి వస్తే బాగుండు. ఎంతో వంటరిగా, దిగులుగా వుంటుంది గుండెల్లో. ఈ బాబాయిగారొకడు. ఎప్పుడు పడితే అప్పుడే వస్తాడు. నాన్న కూడా ఏమీ అనడు. ఆయన వస్తే అమ్మ ఎందుకో నన్ను, అక్కని బైటె కెళ్ళిపోయి ఆడుకోమంటుంది. ఇంత ఎండలో ఎక్కడ కూర్చోను? అరుగుమీద నీడ వుంది. కానీ నేల బాగా వేడిగా వుంది. కూర్చోవడం కష్టం. గోపి వాళ్ళింటికే వెళ్ళి కాస్సేపు ఆడుకుందాం, అనుకుని ప్రక్క వాటా కేసి నడిచాడు నానీ.

"ఏరా నానీ మీ బాబాయొచ్చాడా మళ్ళీ?" నవ్వుతూ అడిగాడు మూర్తి. కమల వారింపుగా చూసింది భర్తవైపు.

"పిల్లవాడితో ఏం మాటలు అవి?"

నానీ ఇన్సల్టుగా ఫీలయి తలొంచుకున్నాడు. బాబాయిగారు రావడం, ఆయన వున్నంతసేపు తామంతా బయట వుండడం వీళ్ళందరికి తమాషాగా, ఎగతాళిగా వుందంటే... బాబాయిగారు రావడం తప్పన్నమాట. అందరిళ్ళకూ బాబాయిలూ, పెదనాన్నలూ వస్తారు కాని, ఎవరూ వారి గురించి ఎగతాళి చేయరు కదా! మరి... మమ్మల్నే ఎందుకు ఎగతాళి చేస్తున్నారు? ఆయన రావడం తప్పా? అంటే ఏం తప్పు? తప్పంటే ఏమిటి......

నానీ నిశ్శబ్దంగా వెనక్కి నడిచాడు.

ఆ రాత్రి తల్లి ప్రక్కలో పడుకుని చాలా గొడవ చేశాడు నానీ బాబాయిగార్ని రానివ్వవద్దని. ఇక ముందు జాగ్రత్తగా వుండాలి అనుకుంటూ ఆమె మాట ఇచ్చింది. అప్పటికి కాని ఆమెను అన్నం తిననివ్వలేదు నానీ.

రాత్రి పదకొండు గంటలవుతుండగా, అంతవరకు చదువుతున్న నవలను దిండు క్రింద పెట్టి సుబ్బలక్ష్మి పడుకోబోతుంటే తలుపు మీద చిన్నగా వేళ్ళతో కొట్టిన చప్పుడు వినిపించి, లేవబోతూ నానీవైపు చూసింది సుబ్బలక్ష్మి. నానీ గాఢ నిద్రలో వున్నాడు.

నిశ్శబ్దంగా మంచం దిగి వీధి గదిలోకి నడిచి జీరో కాండిల్ బల్బు వెలిగించి చప్పుడు కాకుండా వాకిలి తలుపు ఓరగా తెరిచి, తల బయటపెట్టి గుమ్మం అవతల నిలబడ్డ ఆకారాన్ని గుర్తించి తలుపు పూర్తిగా తెరిచింది సుబ్బలక్ష్మి. అతను లోపలికొచ్చి బెడ్ రూమ్ వైపు నడవబోతూ ఆగిపోయాడు. సుబ్బలక్ష్మి కూడా వెనక్కి తిరిగింది. నానీ నిలబడి వున్నాడు బెడ్ రూమ్ గుమ్మం దగ్గర. ఆశ్చర్యంగా చూస్తున్నాడు మూర్తిని.

మూర్తి ముఖం తెల్లగా పాలిపోయింది. **